



మార్కెట్లో రాఖీలు కొనుగోలు చేస్తున్న మహిళలు



71,109 మందికి రుణమాఫీ



- మాఫీ అయిన సొమ్ము రూ.546.36 కోట్లు
- ఆందోళనలో మాఫీ కాని రైతులు
- మార్గదర్శకాలే ప్రతిబంధకాలు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

ప్రభుత్వం ప్రకటించిన విధంగానే ఆగస్టు 15తో రుణమాఫీ పథకం అమలు చేసింది. రెండు లక్షల రూపాయల వరకు ఉన్న పంట రుణాలను మాఫీ చేసింది. ప్రభుత్వం ప్రకటించిన మార్గదర్శకాలే ప్రతిబంధకాలుగా మారి పలువురు రైతులు రుణమాఫీని పొందలేక పోయామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వడ్డీతో సహా రెండు లక్షలు దాటిన రుణాలను బ్యాంకు అధికారులు మాఫీ జాబితాలో చేర్చక పోవడంతో వారికి కూడా రుణమాఫీ కాలేదని విమర్శలు వస్తున్నాయి.

● మూడు దశల్లో..

జిల్లాలో మూడు దశల్లో పూర్తిచేసిన రుణమాఫీ పథకం కింద 71,109 మంది రైతులకు రుణమాఫీ జరిగింది. ఈ రైతులు 546.36 కోట్ల రూపాయల రుణమాఫీ పొందారు. జూలై 18న ప్రభుత్వం ఈ పథకానికి శ్రీకారం చుట్టగా తొలి విడతలో 38,897 మంది రైతులకు 201 కోట్ల 45 లక్షల 61, 235 రూపాయలు, రెండో విడత జూలై 31న 19,420 మంది రైతులకు 182.44 కోట్ల రూపాయలు, మూడో విడత ఆగస్టు 15న 12,792 మంది రైతులకు 162.47 కోట్ల రూపాయలు మాఫీ చేస్తూ ఆ సొమ్ము వారివారి బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. వివిధ సాంకేతిక, తదితర కారణాలతో పలువురు రైతుల అకౌంట్లలో డబ్బు జమకాలేదు.

రుణమాఫీ కాని వారి కోసం స్పెషల్ డ్రైవ్



అన్ని అర్హతలుండి రుణమాఫీ కాని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. రైతులందరికీ న్యాయం చేసేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ఫిర్యాదులు స్వీకరిస్తామని తెలిపింది. రేషన్‌కార్డు లేక, ఆధార్‌కార్డులో తప్పులుండడంతో బ్యాంకు అనుసంధానం కాక, పట్టాదారు పాసుపుస్తకం అందక, వడ్డీ లెక్కల్లో తేడాల కారణంగా రుణమాఫీ పొందలేదని విమర్శలు వస్తున్నాయి. అలాంటి రైతులు వ్యవసాయాధికారులకు దరఖాస్తులు ఇవ్వాలని ప్రభుత్వం సూచించింది. మండల వ్యవసాయాధికారులు ఇంటింటికి తిరిగి ఫిర్యాదులు స్వీకరించాలని ఆదేశించింది. రైతుల నుంచి దరఖాస్తులు తీసుకొని మండలాలవారీగా ఫిర్యాదుల సంఖ్య, ఇతర వివరాలను ప్రతిరోజు పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించింది. రైతు కుటుంబం నిర్ధారించిన వివరాలను పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించింది.

● ప్రతిబంధకాలుగా మారిన మార్గదర్శకాలు :

ప్రభుత్వం రుణమాఫీని వర్తింపజేయడానికి రేషన్‌కార్డును ప్రామాణికంగా తీసుకున్నది. దశాబ్దకాలంగా కొత్త రేషన్‌కార్డులు జారీ చేయలేదు. పదేళ్ల క్రితం ఇచ్చిన కార్డుల్లో ఉమ్మడి కుటుంబాలుగా ఉన్నవారు ఎందరో విడిపోయి వేరు కాపురాలు పెట్టి భూమిని పంచుకొని వ్యవసాయ చేస్తూ జీవిస్తున్నారు. వారు వేర్వేరుగా పంట రుణాలు తీసుకున్నా ప్రభుత్వం విధించిన నిబంధనతో ఒక కుటుంబంలో రెండు లక్షల వరకు మాత్రమే రుణమాఫీ వర్తించింది. దీంతో మరొకరికి లబ్ధిపొందే అవకాశం లేకుండా పోయింది. పీఎం కిసాన్ సమ్మాన్ యోజన కింద లబ్ధి పొందుతున్న వారికే రుణమాఫీ వర్తించిందని, ఇన్‌కంటాక్సు చెల్లించే వారికి, ప్రభుత్వోద్యోగులకు, పెన్షనర్లకు రుణమాఫీ వర్తించలేదని అంటున్నారు. రుణాలు సకాలంలో చెల్లించకపోవడంతో వడ్డీ పెరిగి రెండు లక్షలకు మించాయని, అలాంటి వారి పేర్లు బ్యాంకు అధికారులు మాఫీకి పంపించలేదని, దీంతో తాము నష్టపోయామని రైతులు అంటున్నారు. 2018 డిసెంబరు 12న లేదా ఆ తర్వాత మంజూరైన, రెన్యూవల్ అయిన రుణాలకు, 2023 డిసెంబరు 9నాటికి రైతులు బకాయి ఉన్న అసలు, వడ్డీ మాఫీకి అర్హత ఉంటుందని మార్గదర్శకాల్లో ఉంది. వడ్డీ చెల్లించి రెన్యూవల్ చేయించుకోలేని వారు రెండు లక్షలకు మించి బకాయిపడడంతో వారు కూడా లబ్ధి పొందని పరిస్థితి ఏర్పడింది.

రుణమాఫీ కాలేదని రైతుల ఆందోళన



మొలంగూర్ వద్ద రాస్తారోకో చేస్తున్న రైతులు

శంకరపట్నం, ఆగస్టు 17: తమ రుణాలు మాఫీ కాలేదని రైతులు మండలంలోని మొలంగూర్‌లో ఇండియన్ బ్యాంకు ఎదుట శనివారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్‌ను రైతులు నిలదీశారు. అక్కడి నుంచి కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారి వద్దకు వచ్చి రాస్తారోకో నిర్వహించారు. దీంతో కరీంనగర్-వరంగల్ రహదారిపై వాహనాలు నిలిచిపోయాయి. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ధర్నా విరమించాలని కోరినా కూడా రైతులు వినలేదు. తమకు న్యాయం జరిగే వరకు ఇక్కడి నుంచి లేవబోమని స్పష్టం చేశారు. వ్యవసాయాధికారి వెంకటేష్ రైతుల వద్దకు చేరుకొని ఈ విషయాన్ని పై అధికారులు, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. దీంతో రైతులు శాంతించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ మొదటి విడతలో రుణమాఫీ కాలేదని బ్యాంకుకు వెళ్తే... రెండో విడత అన్నారన్నారు. మూడో విడత అయిన కూడా తమ ఖాతాల్లో డబ్బులు జమ కాలేదన్నారు. ఈ విషయంపై పలుమార్లు ఏవో దగ్గరకు వెళ్తే బ్యాంకు మేనేజర్ దగ్గరకు వెళ్లాలని సూచించారన్నారు. మూడో విడతలోనూ మాఫీ కాకపోవడంతో రోడ్డుపైకి వచ్చామన్నారు. బ్యాంకులో 1,400మంది రైతులు రుణాలు తీసుకుంటే, 311 మందికి మాత్రమే రుణమాఫీ అయ్యిందన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై బ్యాంకు మేనేజర్ మాట్లాడుతూ 2018 కంటే ముందులోను తీసుకుని రిన్యూవల్ చేసుకున్న వారి డేటా పెండింగ్‌లో ఉందన్నారు. సిస్టమ్‌లో అప్‌లోడ్ కాలేదన్నారు. ఈ విషయాన్ని బ్యాంకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు.

రేపు రాఖీ పౌర్ణమి

- మార్కెట్‌లో కనువిందు చేస్తున్న రాఖీలు
- కొనుగోళ్లతో నెలకొంటున్న సందడి

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 17: జిల్లా వ్యాప్తంగా సోమవారం రాఖీ పౌర్ణమిని జరుపుకోనున్నారు. ఈ సందర్భంగా మార్కెట్‌లో కొనుగోళ్ల సందడి నెలకొంటున్నది. జిల్లా కేంద్రంలో పలు ప్రాంతాల్లో రాఖీలు అమ్ముతున్నారు. టవర్‌సర్కిల్, పాతబజార్ రోడ్, మంకమ్మతోట, రాంనగర్, జగిత్యాల రోడ్, కమాన్, తదితర ప్రాంతాల్లో అమ్మకాలు విస్తృతంగా సాగుతున్నాయి. రూపాయి నుంచి మొదలుకొని వెయ్యి రూపాయల వరకు రాఖీలు ధర పలుకుతున్నాయి. పిల్లల నుంచి పెద్దల వరకు అన్ని సైజుల్లో, వివిధ రంగుల్లో ఉన్న రాఖీలను కొనేందుకు అందరూ ఆసక్తి కనబరుస్తున్నారు. ధరలు ఈయేడు పెరిగాయని, దూరప్రాంతాల వారికి పంపడం కోసం కాస్త ముందస్తుగానే కొనుగోలు చేస్తున్నట్లు వినియోగదారులు అంటున్నారు. హైదరాబాద్, వరంగల్, మహారాష్ట్ర, బెంగుళూర్, పూణె, తదితర ప్రాంతాల నుంచి రాఖీలు తెప్పించగా మరో వైపు వెండి, బంగారు వర్తకులు కూడా స్వచ్ఛమైన వెండి, బంగారు రాఖీలను అమ్మకాలకు ఉంచారు. వెండిపూత పూసిన రాఖీలు మంచి ధర పలుకుతున్నాయి. సీజన్ దుకాణాలతో పాటు రోడ్లపై బండ్లను నిలిపి రాఖీలను అమ్ముతున్నారు.



ఎల్‌ఎండీలోకి స్వల్పంగా ఇన్‌ఫ్లో

తిమ్మాపూర్, ఆగస్టు 17: దిగువ మానేరు జలాశయంలోకి స్వల్పంగా ఇన్‌ఫ్లో వస్తోంది. రెండు రోజులుగా ఎగువన కురుస్తున్న వర్షాలకు మోయ తుమ్మెద వాగు నుంచి వరద కొద్దిగా పెరిగింది. ఈ నెల 16 సాయంత్రం వరకు వాగు నుంచి 206 క్యూసెక్కుల నీరు మాత్రమే వచ్చింది. శనివారం ఉదయం ఆరు గంటలకు 1,190 క్యూసెక్కులు, సాయంత్రం ఆరు గంటలకు 1,551 క్యూసెక్కులకు ఇన్‌ఫ్లో పెరిగినట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. ఎల్‌ఎండీ పూర్తి స్థాయి నీటి మట్టం 24.034 టీఎంసీలకు శనివారం సాయంత్రం 6 గంటల వరకు 5.601 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

తెలంగాణ చౌక్‌లో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ

- రోడ్డుపై వాహనాల పార్కింగ్ చేయకుండా చర్యలు...
- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



ప్రశాంతంగా ఉన్న తెలంగాణ చౌక్



తెలంగాణ చౌక్‌లో విధుల్లో ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్

కరీంనగర్ క్రైం, ఆగస్టు 17: తెలంగాణ చౌక్‌లో రోడ్డుపైనే వాహనాల పార్కింగ్ చేయడం, సిగ్నల్ వ్యవస్థ లేకపోవటంతో తరచుగా ట్రాఫిక్ స్తంభిస్తోందని శనివారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి పోలీసు అధికారులు స్పందించారు. తెలంగాణ చౌక్‌లో నలుగురు ట్రాఫిక్ కానిస్టేబుళ్లను ఏర్పాటు చేసి రోడ్డుపై వాహనాలు నిలపకుండా చర్యలు తీసుకున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో తెలంగాణ చౌక్‌లో ట్రాఫిక్ కానిస్టేబుల్స్ వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించి పంపించారు. అడ్డదిడ్డంగా రోడ్లపై వాహనాలను పార్క్ చేసిన వాటిని ఫొటోలు తీసి కేసులు నమోదుకు సిఫారసు చేశారు. తెలంగాణ చౌక్‌తోపాటు నగరంలో ఉదయం, సాయంత్రం సమయాల్లో రద్దీ ఉన్న ప్రాంతాల్లో వాహనాల రాకపోకలను నియంత్రించేందుకు ట్రాఫిక్ కానిస్టేబుళ్లకు డ్యూటీలు వేసి అధికారులు పర్యవేక్షించారు. దీంతో నగరవాసులు హర్షం వ్యక్తం చేశారు.

విజిబుల్ పోలీసింగ్‌కు ప్రాధాన్యమివ్వాలి

- సీపీ అభిషేక్ మొహంతి



మాట్లాడుతున్న సీపీ

కరీంనగర్ క్రైం, ఆగస్టు 17: కమిషనరేట్ వ్యాప్తంగా విజిబుల్ పోలీసింగ్‌కు ప్రాధాన్యమివ్వాలని, ఠాణాల పరిధిలోని గ్రామాలు, నగరంలోని వార్డులను పోలీసు అధికారులు సందర్శించాలని సీపీ అభిషేక్ మొహంతి అన్నారు. కమిషనరేట్ కేంద్రంలో నేర సమీక్షా సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ డయల్ 100 కాల్స్‌తో వచ్చిన ప్రతి ఫిర్యాదుపై చర్యలు తీసుకోవాలన్నారు. రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. నూతన చట్టాల అమలు విషయంలో సందేహాలు ఏర్పడితే సీఐడీ విభాగం అధీనంలో ఏర్పాటు చేసిన ఇన్వెస్టిగేషన్ సపోర్ట్ సెల్ ద్వారా నివృత్తి చేసుకోవాలని సూచించారు. గంజాయి రవాణాపై క్షేత్రస్థాయిలో దృష్టి సారించి ఎన్‌డీపీఎస్ యాక్టు ద్వారా కేసులు నమోదు చేయాలని సీపీ ఆదేశించారు. సైబర్ నేరం జరిగిందని తెలిసిన వారియర్స్ స్పందించి బాధితులకు సహకరించి ఎన్‌సీఆర్‌బీ పోర్టల్ 1930కు సమాచారం అందించి రశీదును పొందాలన్నారు. దీని ఆధారంగా పోగొట్టుకున్న సొత్తును తిరిగి బాధితులకు అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఏసీపీలు శ్రీనివాస్, నరేందర్, వెంకటరమణ, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరు జాబితాలో చేర్చండి



వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పమేలాసత్పతి

కరీంనగర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో 18సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరి పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సి సుదర్శన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్సుద్వారా ఓటరు జాబితాపై కలెక్టర్లు, ఇతర అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. జనవరి 1, 2025 తేదీని ప్రామాణికంగా తీసుకుని ఓటరు జాబితా సవరణ కట్టుదిట్టంగా నిర్వహించాలన్నారు. ఈనెల 20 నుంచి అక్టోబర్ 28వరకు ప్రీ రివిజన్ నిర్వహించి, అక్టోబరు 29న ముసాయిదా ఓటరు జాబితాను విడుదల చేయాలని ఆదేశించారు. నవంబరు 28 వరకు రూపొందించిన ఓటరు జాబితాపై ప్రజల నుంచి అభ్యంతరాలను స్వీకరించాలని, రెండు శనివారాలు, ఆదివారాలు ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలని సూచించారు. డిసెంబరు 24లోగా అభ్యంతరాలను, ఓటర్ క్లెయిమ్స్‌ను పూర్తిస్థాయిలో పరిష్కరించి, జనవరి 6, 2025న తుది జాబితాను రూపొందించాలన్నారు. ఈనెల 20 నుంచి అక్టోబర్ 18 వరకు బూత్ స్థాయి అధికారులు పోలింగ్ కేంద్రాలవారీగా ఇంటింటికి తిరుగుతూ ఓటరు ధ్రువీకరణ చేపట్టాలన్నారు. అవసరమైన చోట పాత ఫొటోలను తొలగించి ఓటర్ల కొత్త ఫొటోలనుకూడా అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. మృతులు, శాశ్వతంగా వలస వెళ్లిన వారి పేర్లు, వివరాలను జాబితా నుంచి ఫారం-7 ద్వారా తొలగించాలన్నారు. 1,500 మంది ఓటర్లకు మించి ఉన్న పోలింగ్ కేంద్రాలు క్రమబద్ధీకరించాలని, అవసరమైన చోట నూతన పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సమర్పించాలని రాష్ట్ర ఎన్నికల అధికారి కలెక్టర్లకు సూచించారు. ఓటరు జాబితాలోని మల్టీ ఎంట్రీలను తొలగించాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్సులో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, అదనపు కలెక్టర్ రెవెన్యూ లక్ష్మీకిరణ్, ట్రైనీ కలెక్టర్ అజయ్‌యాదవ్ పాల్గొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

- జూనియర్ డాక్టర్‌పై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని వైద్యుల డిమాండ్
- జిల్లా ఆసుపత్రిలో గంటపాటు వైద్యసేవల నిలిపివేత
- ప్రైవేట్ హాస్పిటల్స్‌లో ఓపీ సేవలు బంద్
- కలెక్టరేట్ ఎదుట ధర్నా



ధర్నాలో పాల్గొన్న వైద్యులు, సిబ్బంది

సుభాష్‌నగర్, ఆగస్టు 17: జూనియర్ డాక్టర్‌పై హత్యాచారానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ డాక్టర్లు, మెడికల్ స్టూడెంట్లు జిల్లా కేంద్రంలో శనివారం ఆందోళనలు నిర్వహించారు. జిల్లా ఆసుపత్రిలో గంటపాటు వైద్యసేవలు నిలిపివేసి డాక్టర్లు, వైద్య సిబ్బంది తమ నిరసన వ్యక్తం చేశారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో ఓపీ సేవలు నిలిపివేశారు. కలెక్టరేట్ ఎదుట మూడు గంటలపాటు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎంఏ కరీంనగర్ అధ్యక్షుడు డాక్టర్ రాంకిరణ్, కార్యదర్శి డాక్టర్ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ నైట్ డ్యూటీలో ఉన్న జూనియర్ డాక్టర్‌పై పాశవిక దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పనిచేసే ప్రదేశంలో మహిళలకు రక్షణ లేకుండాపోయిందన్నారు. దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. వెంటనే కేసును సీబీఐకి అప్పగించాలని కోరారు. ఆసుపత్రిలో, క్యాంపస్‌లో వైద్యులకు భద్రత కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. అధికారుల ఉదాసీనత కారణం గానే మహిళా డాక్టర్లు, నర్సింగ్, ఇతర సిబ్బందిపై భౌతికదాడులు, నేరాలు జరుగుతున్నాయని ఆరోపించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నిరసన తెలిపిన విద్యార్థులపై గుండాయిజానికి పాల్పడ్డారని ఆరోపించారు. ఈ సంఘటనలు అన్నింటికి నిరసనగా, ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం కాకూడదని వైద్య సేవలు నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ధర్నాలో ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ బీఎన్ రావు, రఘురామన్, విజయ్‌మోహన్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, రమణాచారి, శ్రీలత, రజనీప్రియదర్శిని, నయని, ఎనమల్ల శ్రీదేవి, ఆది శ్రీదేవి, ప్రభాకర్, రఘునాథరావు, లక్ష్మణ్‌కుమార్, ప్రదీప్, వెంకటేశ్వర్లు, విజేందర్‌రెడ్డి, చల్మెడ, ప్రతిమ మెడికల్ కాలేజీ డాక్టర్లు, పీజీ డాక్టర్లు పాల్గొన్నారు. మెడికల్ రిప్రజెంటేటివ్స్, పలు సంఘాల నాయకులు డాక్టర్ల ఆందోళనకు మద్దతు తెలిపారు.

దోషులను కఠినంగా శిక్షించాలి
- డాక్టర్ రాంకిరణ్, ఐఎంఏ అధ్యక్షుడు



డాక్టర్‌ను లైంగికదాడికి పాల్పడి హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలి. డాక్టర్లు, నర్సింగ్ సిబ్బందికి తగిన రక్షణ కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. ఇలాంటి సంఘటన పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలి.

మహిళా డాక్టర్లకు రక్షణ కల్పించాలి
-డాక్టర్ వెంకట్‌రెడ్డి, ఐఎంఏ కార్యదర్శి



పనిచేసే చోట డాక్టర్లకు రక్షణ కల్పించాలి. రాత్రి సమయంలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్లు, సిబ్బందికి రక్షణ కల్పించాలి.

ప్రత్యేక చట్టాలు తీసుకురావాలి
- డాక్టర్ ఎనమల శ్రీదేవి



జూనియర్ డాక్టర్‌పై లైంగికదాడి, హత్యను తీవ్రంగా ఖండిస్తున్నాం. ఈ సంఘటన జరగడం దురదృష్టకరం. ఇలాంటి దుర్ఘటనలు జరగకుండా మహిళల రక్షణ కోసం ప్రత్యేక చట్టం తీసు కురావాలి. ఈ చర్యలకు పాల్పడినవారిని కఠినంగా శిక్షించాలి.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

మంథని రూరల్, ఆగస్టు 17: మండలంలోని సిద్ధిపల్లి వద్ద ఆటో ట్రాలీలో అక్రమంగా తరలిస్తున్న 5 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని శనివారం సివిల్ సప్లై అధికారులు పట్టుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ట్రాలీలో తరలిస్తున్న బియ్యాన్ని మంథని పోలీసు స్టేషన్ అప్పగించి నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. సివిల్ సప్లై అధికారుల ఫిర్యాదు మేరకు ఆటో డ్రైవర్ అంజి, మరో వ్యక్తి రమేష్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కారు నుంచి దట్టమైన పొగలు

భయభ్రాంతులకు గురైన వాహనదారులు



కారు నుంచి వస్తున్న పొగలు

జమ్మికుంట, ఆగస్టు 17: పట్టణంలోని రైల్వే ఓవర్ బ్రిడ్జిపై నుంచి హుజూరాబాద్ వెళ్తున్న ఓ కారు నుంచి శనివారం ఒక్కసారిగా దట్టమైన పొగలు వెలువడ్డాయి. దీంతో కారులో ఉన్న వారు భయపడి కిందకు దిగి దూరంగా వెళ్లారు. కారు సమీపంలో ఉన్న వాహనదారులు భయాందోళనకు గురయ్యారు. ఇంజన్ నుంచి పొగలు వస్తుండటంతో కారు పేలుతుందనే భయంతో పరుగులు పెట్టారు. కాసేపటికి పొగలు తగ్గడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

చక్రాలు ఊడి పొలాల్లోకి దూసుకెళ్లిన బస్సు
తప్పిన ప్రాణాపాయం

జగిత్యాలరూరల్, ఆగస్టు 17 : నిర్మల్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సుకు శనివారం పెనుప్రమాదం తప్పింది. శనివారం జగిత్యాల బస్టాండ్‌లో సుమారు 100 మంది ప్రయాణికులను ఎక్కించుకొని జగిత్యాల నుంచి ఖానాపూర్‌కు వెళ్తుంది. ఈ క్రమంలో బస్సు ప్రయాణిస్తున్న క్రమంలో ఆకస్మాత్తుగా జగిత్యాల రూరల్ మండలంలోని చల్‌గల్- మోర పల్లి గ్రామాల శివారులో బస్సు డ్రైవర్ వెనుక వైపు ఉన్న రెండు చక్రాలు ఊడి పొలాల్లోకి దూసుకెళ్లాయి.. దీంతో బస్సు ఒక్కసారిగా కిందకు పడి ఒకేవైపు కుంగడంతో ప్రయాణికులు ఒక్కసారిగా కేకలు వేసి భయాందోళనకు గురయ్యారు. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో బస్సులో ప్రయాణిస్తున్న 100 మందికి ఎలాంటి ప్రమాదం కాలేదు. దీంతో బస్సులో ఉన్న వారంతా ఊపిరి పీల్చుకున్నారు. మరో బస్సు ఏర్పాటు చేసి వారిని గమ్యస్థానానికి చేర్చారు.

పిల్లల కిడ్నాప్ కేసులో ఇద్దరి అరెస్ట్

● 3.50 లక్షలకు ఇద్దరు ఆడ పిల్లల అమ్మకం ● వివరాలు వెల్లడించిన సీఐ

మెట్‌పల్లి, అగస్టు 17(ఇబ్రహీంపట్నం): ప్రియుడి మోజులో పడ్డ ఓ తల్లి తన ఇద్దరు కూతుళ్లను అమ్ముకుంది. కని పెంచిన అమ్మే ప్రియుడితో కలిసి సొంత బిడ్డలను అమ్ముకుంది. చివరికి ప్రియుడితో పాటు ఆమె కూడా కటకటాల పాలైంది. ఇద్దరినీ మెట్‌పల్లి పోలీసులు పక్కా ప్లాన్ వేసి పట్టుకుని అరెస్ట్ చేశారు. మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం నిజామాబాద్ జిల్లా సారంగాపూర్‌కు చెందిన ఇస్లావత్ లావణ్య (జమున)కు ఎనిమిదేళ్ల క్రితం ఫకీర నాయక్‌తో పెళ్లైంది. లావణ్యకు ఇద్దరు అడపిల్లలున్నారు. రెండేళ్ల క్రితం భర్తతో విబేధాలు రావడంతో వదిలేసి ఒంటరిగా ఉంటోంది. ఈ క్రమంలో లావణ్య ఇబ్రహీంపట్నం మండలం కోమటి కొండపూర్‌లోని ఓ దాబాలో పని చేస్తుండగా అమ్మక్క పేటకు చెందిన ఇస్లావత్ నాగేష్‌తో పరిచయం ఏర్పడి అది వివాహేతర సంబంధానికి దారి తీసింది. ఈ క్రమంలో లావణ్య ఇద్దరు అడపిల్లలను ప్రియుడితో కలిసి అమ్మాలని అనుకుంది. అనాథ పిల్లలని నమ్మించి మేడిపల్లి మండలం పోరుమల్ల గ్రామానికి ఆరేళ్ల బాలిక వైష్ణవిని 2 లక్షలు, మెట్‌పల్లి పట్టణంలోని హన్‌మాన్ నగర్‌కు చెందిన ఒకరికి మూడేళ్ల బాలిక కృష్ణవేణిని 1.50 లక్షలకు అమ్మింది. ఇదే క్రమంలో బాబు కావాలని ఒకరు అడుగగా 1.50 లక్షలకు డీల్ కుదుర్చుకుని పథకం ప్రకారం ఈ నెల 13న నాగేష్ మెట్‌పల్లిలోని దుబ్బవాడలో రెండేళ్ల బాలుడిని కిడ్నాప్ చేసి దొరిపోయాడు.



కిడ్నాప్‌నకు పాల్పడిన నాగేష్

నాగేష్‌ను పట్టుకున్న పోలీస్‌లు కిడ్నాప్ వ్యవహారంలో మరింత లోతుగా విచారణ చేయగా ఇద్దరు అడపిల్లలను అమ్మిన విషయం వెలుగులోకి వచ్చింది. కిడ్నాప్‌లకు పాల్పడుతున్న ఇద్దరిని పట్టుకునేందుకు సీఐ నిరంజన్‌రెడ్డి నేతృత్వంలో మెట్‌పల్లి ఎస్‌ఐ చిరంజీవి ప్రత్యేక టీంగా ఏర్పడి గాలిస్తుండగా పట్టణంలోని చావిడి వద్ద కిరాయి ఉంటున్న ఇంట్లో ఉన్న ఇద్దరిని అరెస్ట్ చేసి మేజిస్ట్రేట్ ముందు హాజరు పరచినట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఇద్దరు చిన్నారులను శిశు సంరక్షణా కేంద్రానికి తరలించినట్లు తెలిపారు. నాగేష్‌పై గతంలో నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి, జిగిత్యాల జిల్లా మెట్‌పల్లి, ఇబ్రహీం పట్నంలో పలు దొంగతనాలలో కేసులు నమోదైనట్లు సీఐ తెలిపారు.

'మిడ్ మానేరు'లోకి కొనసాగుతున్న ఎత్తిపోతలు
కుడి కాలువకు వంద క్యూసెక్కుల నీటి విడుదల

బోయినపల్లి, ఆగస్టు 17: మండలంలోని మిడ్ మానేరు ప్రాజెక్టులోకి ఎల్లంపల్లి నుంచి గాయత్రి పంప్ హౌస్ ద్వారా 4,500 క్యూసెక్కుల, మూల వాగు నుంచి 590 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 318 మీటర్ల గాను ప్రస్తుతం 312.44 ఉండగా, నీటి నిల్వ సామర్థ్యం 27.54 టీఎంసీలకు గాను ప్రస్తుతం 15.38 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది. కాగా మిడ్ మానేరు నుంచి అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 3,200, కుడి కాలువకు వంద క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు.

అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి...

ఇల్లంతకుంట: ఇల్లంతకుంట మండలంలోని అనంతగిరి సమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి నీటి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లో 2.13 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మధ్యమానేరు నుంచి 3600 క్యూసెక్కుల నీటిని రెండు పంపుల ద్వారా ఎత్తిపోస్తుండగా రంగనాయకసాగర్‌కు 3300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి కొనసాగుతున్న ఎత్తిపోతలు

పెద్దపల్లి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి):శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి మిడ్ మానేరులోకి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. శనివారం సాయంత్రం వరకు ప్రాజెక్టు లోకి ఎగువ ప్రాంతం నుంచి 10865 క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా నంది, గాయత్రి పంప్‌హౌస్‌ల ద్వారా మిడ్ మానేరులోకి రెండు మోటార్ల ద్వారా 6300 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. ఎన్టీపీసీకి, హైదరాబాద్, ఆయా నియోజకవర్గాల ప్రజల తాగు నీటి అవసరాల కోసం 452 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 14.449 టీఎంసీల నీళ్ల ఉన్నాయి.

కాకతీయ కాలువకు కొనసాగిన నీటి విడుదల

జగిత్యాల, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు కాలువకు 4,200 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఎస్సారెస్పీలోకి 15,320 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 48.518 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి అవసరాలకు ప్రాజెక్టు నుంచి 5,453 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

చిన్నాన్నను కేసులో ఇరికించేందుకు యువకుడి కట్టుకథ

● కిడ్నాప్‌నకు గురైనట్లు డ్రామా ● పోలీసుల విచారణలో బయటపడిన వ్యవహారం

చందుర్తి, ఆగస్టు 17: భూ వివాదంలో ప్రత్యర్థులను కేసుల్లో ఇరికించడానికి యువకుడు అల్లిన కట్టుకథ వీడింది. పోలీసుల విచారణలో కిడ్నాప్ వ్యవహారం డ్రామాగా తేలింది. శనివారం చందుర్తి పోలీస్‌స్టేషన్‌లో సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై శ్రీకాంత్ వివరాలు వెల్లడించారు. చందుర్తి మండలం ఆశిరెడ్డిపల్లికి చెందిన ఎక్కలదేవి గంగరాజుకు అదే గ్రామానికి చెందిన అతడి చిన్నాన్న ఎక్కలదేవి రాజయ్యకు మధ్య కొంత కాలంగా భూమి విషయంలో గొడవలు జరుగుతున్నాయి. గొడవలకు సంబంధించి గంగరాజు రెండు కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. ఈ నేపథ్యంలో తన చిన్నాన్నతోపాటు అతడి కుమారులు, మరో ముగ్గురిని క్రిమినల్ కేసుల్లో ఇరికించాలని ప్లాన్ వేశాడు. ఈ క్రమంలో గురువారం గంగరాజు అదృశ్యమయ్యాడు. అదే రోజు ఉదయం పొలం వద్ద ద్విచక్ర వాహనం, చెప్పులు షర్టు, మొబైల్ ఫోన్ చిందరవందరగా పడి ఉండడం గ్రామస్థులకు కనిపించడంతో కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులు కేసు నమోదు చేసి వెంటనే గాలింపు చేపట్టారు. చుట్టుపక్కల వ్యవసాయ బావుల్లో వెతికించారు. ఆచూకీ లభించలేదు. శుక్రవారం తెల్లవారు జామున పొలం పనులకు వెళ్తున్న రైతులకు చేతులు, కాళ్లకు తాళ్లు కట్టి ఒంటిపై దుస్తులు లేకుండా, ముఖంపైనా, ఒంటిపైనా బురదతో గంగరాజు కనిపించాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసు లు సంఘటన స్థలానికి చేరుకుని గంగరాజును అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలిం చారు. అతడిని విచరించగా గుర్తుతెలియని వ్యక్తులు తన చేతులు, కాళ్లను కట్టేసి అడవిలో వదిలి వెళ్లినట్లు గంగరాజు పోలీసులతో కథ అల్లాడు. గంగరాజు వ్యవహారశైలిపై అనుమానం వచ్చిన పోలీసులు లోతుగా విచారణ చేపట్టడంతో కిడ్నాప్ వ్యవహారం బయటపడింది. తన చిన్నాన్న ఎక్కలదేవి రాజయ్య, అతడి కూమారులు భూమి విషయంలో జోక్యం చేసుకోకుండా ఉండేందుకు, వారిని కేసుల్లో ఇరికించి భయపెట్టేందుకు కిడ్నాప్ డ్రామా ఆడినట్లు విచారణలో తేలిందని సీఐ తెలిపారు.

ధర్మపురి క్షేత్రంలో శ్రావణ భక్తుల రద్దీ



స్వామివారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

ధర్మపురి, ఆగస్టు 17: శ్రావణ మాసం పురస్కరించుకుని ధర్మపురి క్షేత్రంలో రెండో శనివారం భక్తుల రద్దీ పెరిగింది. స్థానిక శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి అనుబంధ ఆలయాల్లో ఉదయం ఆలయ వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారలకు పంచోపనిషత్తులతో ప్రత్యేక అభిషేకం, సప్త హారతులు, నివేదన, నీరాజన, మంత్రపుష్పాలు జరిపారు. అంతకు ముందు భక్తులు గోదావరి నదిలో స్నానాలు ఆచరించిన అనంతరం ఆలయాలకు చేరు కుని స్వామి వారలను దర్శించుకున్నారు. ఆలయం పక్కాన ఈవో సంకటాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది భక్తులకు తగు సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీని వాస్, ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ, పాలెపు ప్రవీణ్‌కుమార్, ఆలయ ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ఆలయ అర్చకులు, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

వరదకాలువలో పడ్డ ట్రాక్టర్ వెలికితీత



వరదకాలువలో నుంచి పైకి తీస్తున్న ట్రాక్టర్

మల్యాల, ఆగస్టు 17: రెండు రోజుల క్రితం వరదకాలువలో పడ్డ ట్రాక్టర్‌ను శనివారం వెలికి తీశారు. మండలంలోని రాంపూర్ శివారులో గురువారం ట్రేలర్‌తో పాటు ట్రాక్టర్ వరద కాలువలో పడింది. నీరు అధికంగా ఉండడంతో బయటకు తీసే ప్రయత్నాలు ఫలించ లేదు. దీంతో శనివారం ఇరిగేషన్ అధికారులు పంప్‌హౌజ్ వద్ద గల గేట్లను ఒపెన్ చేయడంతో కాలువలోని నీరు తగ్గుముఖం పట్టాయి. నీరు తగ్గి ట్రాక్టర్ తేలడంతో గ్రామస్థులు రెండు జేసీబీల సహాయంతో తాళ్లు కట్టి కాలువ పైకి తీశారు.

21న జాబ్ మేళా

కరీంనగర్ టౌన్, ఆగస్టు 17: నగరంలోని సిటీ సెంటర్ కాంప్లెక్స్‌లో రిలయన్స్ నిప్పాన్ లైఫ్ కంపెనీ మహిళల కోసం ప్రత్యేకంగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు మేయర్ యాదగిరి సునీల్‌రావు తెలిపారు. శనివారం సంస్థ కార్యాలయంలో మేయర్ చేతుల మీదుగా జాబ్ మేళా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ 30 నుంచి 35 ఏళ్ల వయసు గల మహిళలకు ఉపాధి కల్పించేందుకు ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నారని, డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రిలయన్స్ నిప్పాన్ లైఫ్ సీనియర్ మేనేజర్ మాకులూరి రాం మోహన్, మేనేజర్ సిరిసిల్ల ప్రసాద్ పాల్గొన్నారు. పూర్తి వివరాలకు 9848168440 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

పర్సు దొంగిలిస్తున్న మహిళ పట్టివేత

కరీంనగర్ క్రైం, ఆగస్టు 17: కరీంనగర్ ఆర్టీసీ బస్టాండ్‌లో ఒక ప్రయాణికురాలి నుంచి పర్సు, సెల్‌ఫోన్‌లను ఓ మహిళ దొంగిలిస్తుండగా ఆర్టీసీ సెక్యూరిటీ పోలీసులు శనివారం పట్టుకున్నారు. బస్టాండ్‌లోని ఇన్‌గేట్ వద్ద హైదరాబాద్‌కు చెందిన శ్రుతి అనే మహిళా ప్రయాణికురాలు బస్సు దిగుతుండగా ఆమె పర్సు, సెల్‌ఫోన్‌ను విజయవాడకు చెందిన మాధవి అనే మహిళ దొంగిలిస్తుండగా ఆర్టీసీ విజిలెన్స్ సెక్యూరిటీ ఏఎస్‌ఐ ఎం.లక్‌పతి, హెడ్ కానిస్టేబుల్ ఎం.సాగర్, వైసారయ్య, మానసలు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. పట్టుబడిన మహిళ వద్ద నుంచి 3 పర్సులు, ఒక బంగారు గాజు, 42 వేల నగదును స్వాధీనం చేసుకుని, ఒకటో టౌన్ పోలీసులకు అప్పగించామని ఆర్టీసీ సెక్యూరిటీ అధికారులు తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



వినోద్‌కుమార్ (ఫైల్)

మానకొండూర్, ఆగస్టు 17: మానసిక స్థితి సరిగా లేక ఓ యువకుడు పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందాడు. శంకరపట్నం మండలంలోని ముత్తారం గ్రామానికి చెందిన నాయిని వినోద్‌కుమార్ (32)కు మానసిక స్థితి సరిగా లేకపోవడంతో పలు ఆసుపత్రుల్లో చికిత్స చేయించారు. శుక్రవారం పశువుల కొట్టంలో పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. వినోద్‌కుమార్ తండ్రి మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్టేషన్ ఇన్‌చార్జి మొగిలి తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



రంగయ్య (ఫైల్)

ఇల్లంతకుంట, ఆగస్టు 17: మండలంలోని రేపాక గ్రామానికి చెందిన మొగిలోజు రంగయ్య (70) అనే రైతు విద్యుదాఘాతంతో శనివారం మృతి చెందాడు. ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం రంగయ్య శనివారం వ్యవసాయ బావివద్ద పొలంలోని ఒడ్లు చెక్కడానికి వెళ్లాడు. అక్కడే ఉన్న విద్యుత్‌స్తంభం సపోర్టు వైరుకు తగిలాడు. సపోర్టు వైర్‌కు విద్యుత్ సరఫరా అవుతుండటంతో రంగయ్య విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. మృతుడు రంగయ్య భార్య సత్తవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గంజాయి విక్రయదారుల అరెస్ట్

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 17: సిరిసిల్ల పట్టణంలోని సుందరయ్యనగర్‌కు చెందిన ఒల్లెపు వంశీ (24), ఒల్లెపు భీంరాజ్ (20)అనే గంజాయి విక్రయదారులను శనివారం అరెస్ట్ చేశామని టౌన్ సీఐ కె. కృష్ణ తెలిపారు. వీరి వద్ద 200 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలిపారు. వీరు హైద్రాబాద్‌లో గంజాయి కొనుగోలుచేసి సిరిసిల్లకు వచ్చి విద్యానగర్‌లోని వైకుంఠధామం వద్ద ఇతరులకు విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా సమాచారం వచ్చిందన్నారు. దీంతో అన్నదమ్ములను పట్టుకొని విచారించగా వారి వద్ద 200 గ్రాముల గంజాయి లభించిందన్నారు. వెంటనే ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని వివరించారు.

ఘనంగా శ్రీ భూ ఆదివరహా స్వామి కల్యాణ మహోత్సవం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కమాన్‌పూర్, ఆగస్టు 17: మండల కేంద్రంలోని ఆదివరహాస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా శనివారం జరిగింది. స్వామి వారి జయంత్యుత్సవాల్లో భాగంగా వేదపండితులు కనుకుంట్ల వరప్రసాద్ శ్రీనివాసాచార్యులు, రామాంజనేయుల ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణోత్సవం జరిగింది. ఉదయం నిత్యాభిషేకం, గోపూజ, తీర్థ ప్రసాద గోష్టి అలాగే నిత్య పూర్ణాహుతి, తీర్థ ప్రసాద గోష్టి, శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, నిత్య హోమం, పూర్ణాహుతి తదితర వాటిని ఘనంగా నిర్వహించారు. భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈవో కాంతారెడ్డి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మాదాసు రవీందర్ సుజాత దంపతులు అన్నదానం నిర్వహించారు.

అధ్యాత్మిక సంపదకు మారుపేరు భారతదేశం

ఆధ్యాత్మిక సంపదకు మారుపేరు భారతదేశమేనని శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం శరణ్య పీఠాధిపతి శ్రీ బాల బ్రహ్మానంద సర్వసతి మహాస్వామి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఆదివరాహ స్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ దేశాలకు అధ్యాత్మిక సంపదను అందిస్తున్న ఏకైక దేశం భారతదేశమన్నారు. ఆధ్యాత్మిక సంపదకు మూలాధారాలు దేవాలయాలు, గ్రంథాలు, భగవద్గీత, రామాయణం, భాగవతం, వేదాలు మాత్రమేనన్నారు. అనంతరం ఆయనను ఆలయ అర్చకులు, ప్రముఖులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఈవో కాంతారెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ సుప్రియ, దేవాదయ ఇన్స్‌పెక్టర్ సుజాత, ఈవో శంకర్ తదితరులు ఉన్నారు.



బాల బ్రహ్మానంద సర్వసతిని సన్మానిస్తున్న అర్చకులు, అధికారులు

ఎల్‌ఆర్‌ఎస్ హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయండి

-నిబంధనల మేరకు దరఖాస్తులను పరిష్కరించాలి

-సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

కరీంనగర్ టౌన్, ఆగస్టు 17: ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీం(ఎల్‌ఆర్‌ఎస్) దరఖాస్తులను పరిష్కరించేందుకు హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసి వివరాలను సేకరించాలని శాతవాహన అర్బన్ డెవలప్‌మెంట్ అథార్టీ (సుడా) చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన సుడా కార్యాలయంలో వైస్ చైర్మన్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌తో కలిసి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న 22వేల ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు, టీఎస్‌బీపాస్ పర్మిషన్లు, అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ దరఖాస్తుదారులను సంప్రదించి క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి నిబంధనల మేరకు ఉన్న దరఖాస్తులను క్లియర్ చేయాలని ఆదేశించారు. టీఎస్ బీపాస్ ద్వారా పొందిన పర్మిషన్లలో అవకతవకలు ఉంటే వెంటనే వారికి నోటీసులు జారీ చేసి సరిచేయాలని అన్నారు. అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలను తయారు చేసి ఇవ్వాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈసమావేశంలో డీపీవో రవీందర్, సీపీవో కోటేశ్వర్‌రావు, డిటిసిపి ఆంజనేయులు, ఎస్ఈ రాజ్‌కుమార్, ఈఈ రొడ్డ యాదగిరి, ఏఈ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి



విద్యార్థులను అభినందిస్తున్న అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డి

భగత్‌నగర్, ఆగస్టు 17: విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని అల్ఫోర్స్ చైర్మన్ డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి అన్నారు. కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాల విద్యార్థులు స్వాతంత్ర్య దినోత్సవంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కలెక్టర్ పమేలాసత్పతి నుంచి ప్రశంసాపత్రాలు అందుకున్నారు. ఈసందర్భంగా శనివారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను నరేందర్‌రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలకు చెందిన ఎస్ సాయిశిక్, వై సాయిసొభిత్‌లు గ్రాస్ కటింగ్ మిషన్ నమూనాను తయారు చేసి అద్భుతమైన ఆలోచన చేశారన్నారు. ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ప్రశంసాపత్రాలు అందుకున్నారన్నారు.

పాఠశాలకు పూర్వ విద్యార్థి రూ.50వేల విరాళం

కరీంనగర్ టౌన్, ఆగస్టు 17: నగరంలోని ప్రభుత్వ పురాతన ఉన్నత పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థి దాసరి తిరుపతిరెడ్డి తాను చదువుకున్న పాఠశాలకు శనివారం 50వేల రూపాయల చెక్కును విరాళంగా అందించారు. నగరంలోని ప్రభుత్వ పురాతన ఉన్నత పాఠశాలలో విద్యాభ్యాసాన్ని సాగించి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో లెక్చరర్‌గా పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ విద్యాసంవత్సరం నుండి పదవ తరగతిలో అత్యున్నత ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థులకు నగదు పారితోషకాన్ని కూడా అందిస్తానని ప్రకటించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు షేక్ చాంద్, ఉపాధ్యాయులు తవుటు లింగారెడ్డి, జూపల్లి జగదీశ్వర్‌రావు, అనసూరి నటరాజు, జక్కు కృష్ణమూర్తి, జేరిపోతుల దివాకర్, మాలోతు ప్రవీణ్, ఫయాజ్ అలీ, పల్లె తిరుపతి పాల్గొన్నారు.

జాతీయస్థాయి సైన్స్ వర్క్‌షాపునకు ఓదెల కుమార్ ఎంపిక

కరీంనగర్ టౌన్, ఆగస్టు 17: సీఎస్ఆర్‌రావు సైన్స్ ఎడ్యుకేషన్ టెక్నాలజీ యూనిట్, జవహర్‌లాల్ నెహ్రూ సెంటర్ ఇండియన్ నేషనల్ సైన్స్ బెంగుళూరులో సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే జాతీయ స్థాయిసైన్స్ వర్క్‌షాపునకు భాషబత్తిని ఓదెల కుమార్ ఎంపికయ్యారు. బెంగుళూరులో ఈనెల 20,21 తేదీల్లో కెమికల్ సొసైటీ ఆఫ్ థాయిలాండ్, బ్యాంకాక్ పబ్లిక్ కంపెనీల సౌజన్యంతో నిర్వహిస్తున్న ఈ వర్క్‌షాపునకు జిల్లాలోని ఇందుర్తి జడ్పీ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ ఓదెల కుమార్ ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సిహెచ్.జయప్రద ఒక ప్రకటనలో తెలిపారు.

రుణమాఫీ పూర్తి స్థాయిలో చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి

హుజూరాబాద్, ఆగస్టు 17: కాంగ్రెస్ ప్రభుత్వం మాట ఇచ్చిన ప్రకారం పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి అన్నారు. శనివారం హుజూరాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో చాలా మంది రైతులకు రుణమాఫీ కాకపోవడంతో రోడ్లపైకి వచ్చి ధర్నాలు చేస్తున్నారన్నారు. 31లోగా ప్రతి రైతుకు రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేయాలన్నారు. ఎస్సారెస్పీ కెనాల్ కింద నీళ్లు లేకపోవడంతో చాలా మంది రైతులు దుక్కులు దున్నలేదని, వెంటనే ప్రభుత్వం స్పందించి క్రాఫ్ హాలిడే ప్రకటించి ఎకరానికి 50 వేల రూపాయలు పరిహారంగా అందించాలన్నారు. సెప్టెంబరు 15లోపు డబుల్ బెడ్‌రూం ఇళ్లు పంపిణీ చేయకపోతే సీపీఐ తరుపున పేద ప్రజలకు పంచు తామన్నారు. ఈ నెల 20న సీపీఐ జిల్లా నిర్మాణ కౌన్సిల్ సమావేశం హుజూరాబాద్‌లోని మధువని గార్డెన్‌లో నిర్వహిస్తున్నామని తెలిపారు. సమావేశంలో సృజన్ కుమార్, అశోక్, రవి, చాంద్‌పాషా, రాజు, రాములు, వెంకటేష్, మాధవ్ పాల్గొన్నారు.

రైతాంగాన్ని మోసం చేసిన కాంగ్రెస్ సర్కార్



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి

జమ్మికుంట, ఆగస్టు 17: రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగాన్ని మోసం చేసిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. శనివారం జమ్మికుంటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆగస్టు 15 వరకు 31 వేల కోట్లు మాఫీ చేస్తామని చెప్పి, తొమ్మిది వేల కోట్లు కోత పెట్టాడని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిజంగా రెండు లక్షల రుణమాఫీ చేస్తే 22 లక్షల మంది రైతులే ఉంటారా, 17,869 కోట్లు మాత్రమే అవుతాయా ప్రజలు గమనించాలన్నారు. ఈ ఒక్క విషయంతోనే రుణమాఫీ పచ్చి అబద్ధం అని తేలిపోయిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి దమ్ముంటే రుణమాఫీపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యాక్షులు ఎరబెల్లి సంపత్‌రావు, నాయకులు మాడ గౌతమ్‌రెడ్డి, జీడి మల్లేష్, సింగిరెడ్డి తిరుపతిరెడ్డి, కట్కూరి అశోక్‌రెడ్డి, బండి కోటేశ్వర్, గుర్రం సంతోష్, తుర్పాటి భాస్కర్, బండి సంపత్, రాణ ప్రతాప్, రాకేష్, విజయ్, వినయ్, వెంకటేష్ పాల్గొన్నారు.

విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న ఎక్సైజ్ అధికారి శ్రీనివాస్‌రావు

సైదాపూర్, ఆగస్టు 17: విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా విలువలతో కూడిన జీవితాన్ని నిర్మించుకోవాలని జిల్లా ఎక్సైజ్ అధికారి శ్రీనివాస్‌రావు అన్నారు. శనివారం ఆయన మండలంలోని గొడిశాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మత్తు పదర్థాలు, మాదక ద్రవ్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు మంచి అలవాట్లను అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో హుజూ రాబాద్ ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్, హెచ్‌ఎం సత్యనారాయణ, రమేష్, ఎక్సైజ్ సిబ్బంది ముకుందరెడ్డి, చిరంజీవి, కార్తిక్, దేవేందర్, స్రవంతి, రాజశేఖర్ పాల్గొన్నారు.

హత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి



నిందితుల దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

గణేశ్‌నగర్, ఆగస్టు 17: కోల్‌కతాలోని మెడికల్ కళాశాలలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో నిందితుల దిష్టిబొమ్మ తెలంగాణ చౌరస్తా వద్ద దహనం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జల శ్రీకాంత్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నరేష్ పటేల్ మాట్లాడుతూ దేశంలో మహిళలపై దాడులు పెరిగిపోతున్నా ప్రభుత్వాలు స్పందించడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కాంపెల్లి అరవింద్ ఉపాధ్య క్షులు వినయ్ ఇషాక్, సభ్యులు గట్టు ఆకాష్ డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు రమేష్, నాయకులు భూమేష్, నాగేష్, శ్రీనివాస్, నాగేష్ యువరాజ్ పాల్గొన్నారు.

● **భగత్‌నగర్:** కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారం చేసిన దుండగులను శిక్షించాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నరేష్ పటేల్ డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని మంకమ్మతోటలోని జిల్లా కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈకార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు లక్‌పతినాయక్, అజయ్‌రాజు, రాజేందర్ పాల్గొన్నారు.

మహిళా డాక్టర్లకు రక్షణ కల్పించాలి

సుభాష్‌నగర్: మహిళ డాక్టర్లకు రక్షణ కల్పించాలని మెడికవర్ వైద్యుడు డాక్టర్ వినయ్ కోరారు. శనివారం కోల్‌కతాలోని మెడికల్ కాలేజీ ఘటనపై ఆసుపత్రిలో ఓపీ సేవలు నిలిపివేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో మెడికవర్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్, మార్కెటింగ్ మేనేజర్ కరుణాకర్, ఆపరేషన్ మేనేజర్ సాయిచరణ్, హెచ్ఆర్ మేనేజర్ ఈశ్వర్ పాల్గొన్నారు.

●హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని కరీంనగర్ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బేతి మహేందర్‌రెడ్డి అన్నారు. శనివారం ఐఎంఏ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట డాక్టర్లు నిర్వహించిన ధర్నాకు బార్ అసోసియేషన్ మద్దతు తెలిపింది. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు టి రఘువీర్, కార్యవర్గ సభ్యులు సుంకే దేవకిషన్, బెజ్జంకి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

● **హుజూరాబాద్ / జమ్మికుంట రూరల్/మానకొండూర్/రామడుగు/మానకొండూర్/చొప్పదండి/ గన్నేరువరం:** హుజూరాబాద్ ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యులు నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. జమ్మికుంటలోని గాంధీ చౌరస్తాలో ఐఎంఏ, ట్రస్మా ఆధ్వర్యంలో విద్యార్థులు మానవహారంగా ఏర్పడ్డారు. రామడుగు పీహెచ్‌సీ ఆవరణలో వైద్య సిబ్బంది నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. గోపాల్‌రావుపేటలో కొవ్వొత్తులతో నివాళులర్పించారు. మానకొండూర్ మండలంలోని వైద్య సిబ్బంది ఆరోగ్య కేంద్రాల ఎదుట నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. చొప్పదండి పీహెచ్‌సీ వైద్యులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. గన్నేరువరం మండలంలోని చొక్కారావుపల్లిలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి నివాళులర్పించారు.

ముందస్తు ఫొటోగ్రఫీ దినోత్సవం

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 17: కరీంనగర్ జిల్లా, పట్టణ ఫొటోగ్రఫీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం టవర్ సర్కిల్ వద్ద ముందస్తు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మేయర్ సునీల్‌రావుతో పాటు అంతర్జాతీయ ఫొటోగ్రఫీ అవార్డు గ్రహీత, తెలంగాణ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ సలహాదారు కేదార్‌రెడ్డి కేక్ కట్ చేసి స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సిరి రవి, క్యాషియర్ గొంటి లక్ష్మణ్, వైస్ ప్రెసిడెంట్ ఫోకస్ శ్రీను, పట్టణ అధ్యక్షుడు కొప్పుల కనకారావు, ప్రధాన కార్యదర్శి నాగిశెట్టి రమేశ్, క్యాషియర్ రఫీ, వేణు పాల్గొన్నారు.

నేడు 'భూమిక' పుస్తకావిష్కరణ

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 17: రచయిత వైరాగ్యం ప్రభాకర్ రచించిన, భవానీ సాహిత్యవేదిక ద్వారా ప్రచురించిన 98వ పుస్తకం 'భూమిక' ఆధునిక సాహిత్య విమర్శ వ్యాసాల పుస్తకం ఆదివారం ఉదయం 10 గంటలకు కరీంనగర్ వాగేశ్వరి డిగ్రీ కళాశాలలో ఆవిష్కరిస్తున్నట్లు కాసు మహేందర్‌రాజు ఒక ప్రకటనలో తెలిపారు. తెరవే అధ్యక్షుడు సిపీ కుమార్ అధ్యక్షతన ముఖ్య అతిథిగా తెలుగు విశ్వ విద్యాలయం సాహితీ పురస్కార గ్రహీత డాక్టర్ కాంచనపల్లి గోవర్ధనరాజు పుస్తకాన్ని ఆవిష్కరిస్తారన్నారు.

బీసీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలి



మాట్లాడుతున్న బీసీ సంక్షేమసంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ లింగమూర్తి

గణేశ్‌నగర్, ఆగస్టు 17: కాంగ్రెస్ నాయకులు ఎన్నికల సమయంలో కామారెడ్డిలో ఇచ్చిన హామీ మేరకు బీసీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లం లింగమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం జిల్లా తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో తెలంగాణ బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దుబ్బాక రమేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ కులగణన చేయని పక్షంలో బీసీల నుంచి భంగపాటు తప్పదని హెచ్చరించారు. రాహుల్‌గాంధీ దేశంలో కులగణన, బీసీ రిజర్వేషన్లపై పార్లమెంట్ బీజేపీతో కొట్లాడుతుంటే ఆయన స్ఫూర్తితో పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో మాత్రం బీసీ రిజర్వేషన్లు కల్పించే విషయంలో స్పష్టత లేకపోవడం శోచనీయం అని మండిపడ్డారు. కార్యక్రమంలో తెలంగాణ బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దుబ్బాక రమేష్, తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు పెంట అజయ్ పటేల్, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం కరీంనగర్ పార్లమెంట్ ఇంచార్జ్ కాల్వ మధుబాబు, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గరిగె కోటేశ్వర్, తెలంగాణ బీసీ విద్యార్థిసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాండ్ల అజయ్ కుమార్ పాల్గొన్నారు.

ముందస్తు రక్షాబంధన్ వేడుకలు




సెయింట్‌జార్జ్ పాఠశాలలో రాఖీ వేడుకలో పాల్గొన్న చిన్నారులు, పారమిత హెరిటేజ్ పాఠశాలలో..

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 17: నగరంలోని పలు ప్రైవేట్ విద్యాసంస్థల్లో శనివారం ముందస్తు రక్షా బంధన్ వేడుకలను నిర్వహించారు.పారమిత హెరిటేజ్ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో చైర్మన్ డాక్టర్ ఇ.ప్రసాద్‌రావు, డైరెక్టర్లు పాల్గొన్నారు. సాధన స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ సిహెచ్.శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు. అచీవర్స్ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో డైరెక్టర్ వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ పల్లవి పాల్గొన్నారు. శ్రీసరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆయాచితుల లక్ష్మన్‌రావు, అప్పిడి వకుళాదేవి, గీకురు కృష్ణవేణి, పాఠశాల కార్యదర్శి కోల అన్నారెడ్డి తదితరులు పాల్గొన్నట్లు ప్రధానాచార్యులు రాజమౌళి తెలిపారు.

● **భగత్‌నగర్:** నగరంలోని సెయింట్‌జార్జ్ ఇంటర్నేషనల్ (సిబిఎస్ఈ) పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో చైర్మన్ పి.ఫాతిమారెడ్డి, ప్రిన్సిపాల్ భార్గవ్, నిరంజన్ పాల్గొన్నారు.

● **కరీంనగర్ రూరల్:** బొమ్మకల్ ప్రభుత్వ పాఠశాలలో శ్రీలక్ష్మి జంతు సంరక్షణ ఆధ్వర్యంలో రక్షా బంధన్ వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆసిరి సుమన్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్ శ్రీదేవి, సాగి గీత పాల్గొన్నారు.

హుజూరాబాద్/ఇల్లందకుంట/రామడుగు/గంగాధర: పట్టణంలోని అల్ఫోర్స్, ఏకశిల పాఠశాలల్లో రాఖీ వేడుకలు నిర్వహించారు. ఇల్లందకుంట మండల కేంద్రం, శ్రీరాములపల్లి, కనగర్తి, సిరిసేడు గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలో బీజేపీ మండలాధ్యక్షుడు సింగిరెడ్డి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో రాఖీ వేడుకలు నిర్వహించారు. రామడుగు మండలం గోపాల్‌రావుపేట అల్ఫోర్స్ పాఠశాలలో రాఖీ పండుగ సంబరాలు జరిగాయి. గంగాధర మండలంలోని పలు విద్యా సంస్థల్లో ముందస్తుగా రాఖీ వేడుకలు నిర్వహించారు.

● **గన్నేరువరం:** మండలంలోని మైలారం గ్రామానికి చెందిన బీజేపీ మానకొండూరు అసెంబ్లీ కన్వీనర్ ముత్యాల జగన్‌రెడ్డి తన ఎంజేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామాల్లోని ఇంటింటికీ రాఖీలు అందజేశారు.

కన్నుల పండువగా శ్రీవారి కల్యాణం




చొప్పదండిలో వేంకటేశ్వరస్వామి, ఎల్ఎండీ కాలనీలో లక్ష్మీనృసింహస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

చొప్పదండి, ఆగస్టు 17: పట్టణంలోని వేంకటేశ్వర మణికంఠ ఆలయంలో శనివారం శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకుడు పోలోజు చరణాచార్యులు, ఆలయకమిటీ అధ్యక్షుడు బొడిగె వెంకటేష్, ప్రధాన కార్యదర్శి చేపూరి సత్యనారాయణ, కోశాధికారి దండె సత్యానందం, సభ్యులు, భక్తులు, పాల్గొన్నారు.

● తిమ్మాపూర్: మండలంలోని ఎల్ఎండీ కాలనీ తాపాల లక్ష్మీనృసింహస్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ స్వామి వారి కల్యాణంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. 19న శకటోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు తిరునగిరి వెంకటాద్రి, ఆలయ కమిటీ చైర్మన్ ఇనుకొండ నాగేశ్వర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎల్లారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

'సంక్షేమంపై చిత్తశుద్ధి లేని కాంగ్రెస్'

గంగాధర, ఆగస్టు 17: సంక్షేమంపై కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. శనివారం ఆయన గంగాధరలో విలేకరులతో మాట్లాడుతూ పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయక రైతులను మోసం చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డిదన్నారు. కాంగ్రెస్, బీజేపీ రెండు ఒక్కటేనని, బీఆర్ఎస్‌ను ఎదురుకోలేక డ్రామాలాడుతున్నారని అన్నారు. బండి సంజయ్ అబద్ధాలు ఆపి కరీంనగర్ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు బాలాగౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నవీన్‌రావు, కంకణాల విజేందర్‌రెడ్డి, నజీర్‌హుస్సేన్, దామోదర్, మల్లేశం, మేఘరాజు, అబ్బాస్, పంజాల ఆంజనేయులు, మహిపాల్, అజయ్ పాల్గొన్నారు.

'గోరక్షకులకు అండగా ఉండాలి'

తిమ్మాపూర్, ఆగస్టు 17: గోరక్షకులకు అండగా ఉండాలని హిందూ మహా సభ జాతీయ ప్రధాన కార్యదర్శి యోగి అతిథి మహారాజ్ స్వామీజీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని రామక్రిష్ణకాలనీలో గల మిషన్ వందే గోమాతరం సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గోశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన గోవులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామీజీ మాట్లాడుతూ గోవు పాలు తల్లి పాలతో సమానమన్నారు. బీజేపీ సీనియర్ నాయకుడు పోల్సాని సుగుణాకర్‌రావు మాట్లాడుతూ ప్రతీ రోజు గోవులపై దారుణమైనా ఆకృత్యాలు జరుగుతున్నా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదన్నారు. కబేలాలకు తరలించే గోవులను రక్షించాలన్నారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకుడు సీపెల్లి వీరమద్విరాజ్, సంస్థ సభ్యులు వేణు, వీహెచ్‌పీ జిల్లా నాయకుడు ఉట్కూరి రాధాకృష్ణారెడ్డి, నాయకులు సుగుర్తి జగదీశ్వరాచారి, ఎడ్ల భూంరెడ్డి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

పాడి పశువుల ఎంపికపై అవగాహన

వీణవంక, ఆగస్టు 17: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఇందిరా మహిళశక్తి స్వయం సంఘాల సభ్యులకు పాడి పశువుల ఎంపిక, యాజమాన్య పద్ధతులపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారి శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ మేలు రకం జాతి పశువులను ఎంచుకుంటే అధిక లాభాలు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారి శ్రీకాంత్‌రెడ్డి, ఏపీఎం కొమురయ్య, ఏపీవో స్వామి, మండల సమాఖ్య ఉపాధ్యక్షుడు గొట్టె సుజాత, సీసీలు పాల్గొన్నారు.

శాయంపేటలో వైద్య శిబిరం

జమ్మికుంట రూరల్, ఆగస్టు 17: మండలంలోని వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శాయంపేట, పాపక్కపల్లి గ్రామాల్లో శనివారం వైద్య శిబిరాలు నిర్వహించారు. శాయంపేటలో 85 మంది, పాపక్కపల్లిలో 53 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు పంపిణీ చేశారు. జ్వరంతో బాధపడుతున్న తొమ్మిది మంది రక్త నామునాలు సేకరించి ల్యాబ్‌కు పంపించినట్లు వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు విజయ్‌కుమార్, కార్తీక్, హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్‌రెడ్డి, సూపర్వైజర్లు సదానందం, కుసుమకుమారి, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

యువత సేవా దృక్పథం కలిగి ఉండాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

గన్నేరువరం, ఆగస్టు 17: యువత సేవా దృక్పథం కలిగి ఉండాలని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని గుండ్లపల్లిలో సేవా యువత ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. రక్తదాతలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవా యువత ఫౌండేషన్ సభ్యులు రక్తదాన, వైద్య శిబిరాలను నిర్వహించడం అభినందనీ యమన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు సుదగోని సాయితేజ గూడెల్లి అరుణ్, సంతోష్, ప్రశాంత్, కాంగ్రెస్ నాయకులు బేతెల్లి రాజేందర్, మల్లేశం, నాగపురి శంకర్, సంతోష్, సత్యనారాయణ పాల్గొన్నారు.

కుక్క దాడిలో ముగ్గురికి గాయాలు

కరీంనగర్ క్రైం, ఆగస్టు 17: కొత్తపల్లి మండలం సీతారాంపూర్‌లోని సాయిరాంనగర్‌లో ఒక కుక్క ముగ్గురు వ్యక్తులపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచిందని గ్రామస్థులు తెలిపారు. శనివారం గ్రామంలోని కుక్క శివకుమార్ అనే వ్యక్తితో పాటు మరో ఇద్దరిని తీవ్రంగా గాయపరచగా వారిని కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. కుక్కదాడిలో గాయపడిన వారికి వైద్య చికిత్సలు అందించి ఆదుకోవాలని కోరారు.

కాంగ్రెస్‌లో చేరిక

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 17: కరీంనగర్‌కు చెందిన ఎస్ఆర్ఐ మొహమ్మద్ నుస్రత్ హుస్సేన్ 54వ డివిజన్ కశ్మీర్‌గడ్డలోని కాంగ్రెస్ మైనార్టీ సెల్ జిల్లా కార్యాలయంలో శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. జిల్లా కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు మొహమ్మద్ తాజ్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు మొహమ్మద్ కలిమొద్దీన్, జిల్లా ప్రధానకార్యదర్శి సయ్యద్ కరీం, ఎండీ జలీల్ పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత

కరీంనగర్ టౌన్, ఆగస్టు 17: గాయత్రి బ్యాంకు ఖాతాదారుడు తేట్ల కరుణాకర్ ఇటీవల మృతిచెందగా శనివారం బ్యాంకు ఆవరణలో కుటుంబసభ్యులు తేట్ల లక్ష్మికి బీమా చెక్కు లక్ష రూపాయలను జిల్లా సహకార అధికారి రామానుజాచార్య చేతుల మీదుగా అందజేశారు. ఈకార్యక్రమంలో బ్రాంచి మేనేజర్ జి.అశోక్ పాల్గొన్నారు.

'సీనియర్ సిటిజన్స్ చట్టం సక్రమంగా అమలు కావడం లేదు'

సుభాష్‌నగర్, ఆగస్టు 17: జిల్లాలో మెయింటనెన్స్ అండ్ వెల్ఫేర్ ఆఫ్ పేరెంట్స్ అండ్ సీనియర్ సిటిజన్స్ చట్టం-2007, రూల్-2011 సక్రమంగా అమలు కావడం లేదని కరీంనగర్ జిల్లా సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోయేషన్ అధ్యక్షుడు సముద్రాల జనార్దన్‌రావు అన్నారు. శనివారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పు అమలు కావడం లేదని ఆరోపించారు. ఈ అంశాలన్నింటిపై ఈనెల 20న ఫెడరేషన్ ఆఫ్ సీనియర్ సిటిజన్ అసోసియేషన్ కార్యాలయంలో చర్చించి సంబంధిత మంత్రికి వినతిపత్రం అందచేయ నున్నట్లు తెలిపారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి తొడుపునూరి ఆనందం, కార్యవర్గ సభ్యులు చింతల సత్య నారాయణ, చెన్నమనేని దామోదర్‌రావు, మర్రి రాజేందర్, కరారి రాజేంద్రప్రసాద్‌రావు పాల్గొన్నారు.

'రాజ్యాధికారమే లక్ష్యంగా పనిచేయాలి'

సుభాష్‌నగర్, ఆగస్టు 17: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు రాజ్యాధికారమే లక్ష్యంగా పనిచేయాలని విజిఆర్ నారగోని అన్నారు. శనివారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రాజకీయ సమ న్యాయంపై చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ త్వరలో బస్సు యాత్ర చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం జిల్లా కన్వీనర్లను ప్రకటించారు. జిల్లా కన్వీనర్లుగా శాతరాజు ప్రదీప్ రాజుకుమార్, కొండ్ర లక్ష్మన్‌లను నియమించారు. కార్యక్రమంలో కెపి పాల్, కనకయ్య తగగొండ సత్యరాజ్ వర్మ, మేడి మహేశ్, తడగొండ నర్సింగ్, కెంసారం తిరుపతి, వెంకట మల్లయ్య హనుమంతు, ఎండి సర్వర్ పాల్గొన్నారు.

తెలంగాణ ఐకాన్ అవార్డు అందుకున్న ద్రోణాచారి

సుభాష్‌నగర్, ఆగస్టు 17: తెలంగాణ థియేటర్, మీడియా రెపర్టరీ, తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ సంయుక్తంగా అందజేసే తెలంగాణ ఐకాన్ అవార్డుకు 2024 సంవత్సరానికి గాను జిల్లా కేంద్రానికి చెందిన రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ అఫిషియల్స్, ప్రొఫెషనర్స్ అసోసియేషన్ ఫౌండర్, రాష్ట్ర కన్వీనర్ వేములవాడ ద్రోణాచారి ఎంపికయ్యారు. అవార్డును శనివారం హైదరాబాద్‌లో తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ సంచాలకుడు, రాష్ట్ర పారిశ్రామిక సంస్థ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి చేతుల మీదుగా ద్రోణాచారి అందుకున్నారు.

'రైతులను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం'

భగత్‌నగర్, ఆగస్టు17: రాష్ట్రంలోని రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని బీజేపీ రాష్ట్ర సీనియర్ నాయకుడు కొట్టె మురళీకృష్ణ అన్నారు. వరి క్వింటాలుకు 500 బోనస్, వానాకాలం మొదలై మూడు నెలలు గడుస్తున్నా పెట్టుబడి సాయం, రైతులకు ఉచిత పంటల బీమా అమలు చేయలేదన్నారు.

సంక్షిప్తంగా..

● హుజూరాబాద్ రూరల్: శిక్షణలో నేర్చుకున్న అంశాలపై ఎన్‌సీసీ కేడెట్లు సాధన చేయాలని కమెడింగ్ ఆఫీసర్ డానియల్ లైటిజమ్ అన్నారు. మండలంలోని సింగాపూర్ కిట్స్‌లో నిర్వహిస్తున్న శిక్షణ శిబిరం శనివారం ముగిసింది.

● జమ్మికుంట రూరల్: పట్టణంలోని మహమ్మదీయ ఖురేషి హలీమా కమ్యూనిటీ హాల్‌లో హుజూరాబాద్ జామి మస్జీద్ ఈద్గా, ఖబర్థాన్ మేనేజర్‌మెంట్ కమిటీ అధ్యక్షులు మొహమ్మద్ ముజాహిద్ హుస్సేన్‌ను సన్మానించారు.

- జమ్మికుంటలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో రుణమాఫీ కాని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చైర్మన్ పొనగంటి సంపత్ అన్నారు. అర్హులైన రైతులందరికి ఈ నెల 30 వరకు రుణమాఫీ జరుగుతుందన్నారు.

● వీణవంక: మండలంలోని బొంతుపల్లి పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన జానపట్ల అనిత బదిలీకాగా ఆమెను గ్రామస్థులు సన్మానించారు.

● తిమ్మాపూర్: కరీంనగర్ ఇరిగేషన్ సర్కిల్-2లో ఎస్ఈగా అదనపు బాధ్యతలు స్వీకరించిన పి రమేష్ మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను మర్యాదపూర్వకంగా కలిశారు.

● చొప్పదండి: పట్టణంలోని బ్రాహ్మణ కుంట శిఖం భూమిని కబ్జాదారుల నుంచి కాపాడాలని ఏఐఎఫ్‌బీ ప్రధాన కార్యదర్శి బండారు శేఖర్ తహసీల్దార్ నవీన్‌కు ఇచ్చిన వినతి పత్రంలో కోరారు.

● హుజూరాబాద్: పట్టణంలోని ప్రతాపవాడ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 23 మంది విద్యార్థులకు ప్లేట్లను గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్టు నిర్వాహకులు జగదీశ్వర్ శనివారం పంపిణీ చేశారు.

- పట్టణానికి చెందిన తీన్మార్ మల్లన్న రాష్ట్ర కమిటీ సభ్యుడు బండ రమేష్ అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన అంత్యక్రియల్లో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పాల్గొన్నారు. రమేష్ కుటుంబానికి ఎమ్మెల్సీ 50 వేల రూపాయలు అందజేశారు.

- హుజూరాబాద్ ఏవోగా చాడ భూమిరెడ్డి, జమ్మికుంట ఏవోగా షేక్ ఖాదర్ హుస్సేన్, ఇల్లందకుంట ఏవోగా సూర్య నారాయణ బాధ్యతలు ఏడీఏ సునీత తెలిపారు.

● శంకరపట్నం: బదిలీపై వెళ్తున్న, బదిలీపై మండలానికి వచ్చిన అధికారులు, పంచాయతీ సెక్రెటరీలను కేశవపట్నం రైతు వేదికలో సన్మానించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, ఎంపీడీవో కృష్ణ ప్రసాద్, ఎంపీవో ప్రభాకర్, మాజీ జడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, మండల అధ్యక్షుడు బసవయ్య పాల్గొన్నారు.

- పంచాయతీ కార్యదర్శుల సంఘం శంకరపట్నం మండల అధ్యక్షుడిగా కేశవపట్నం పంచాయతీ కార్యదర్శి దురిశెట్టి నర్సయ్య ఎన్నికయ్యారు. అసోసియేట్ అధ్యక్షుడిగా ఎలగందుల శ్రీనివాస్, జనరల్ సెక్రెటరీగా తోటరాజు, ట్రెజరర్‌గా దాసరి వీరప్రతాప్ ఎన్నికయ్యారు.

- శంకరపట్నం మండలం ఆముదాలపల్లిలో ప్రభుత్వ అయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తపోటు, మధుమేహం, షుగర్, కీళ్ల నొప్పులు, నడమునొప్పి, అర్శ మొలలు పరీక్షలు ఉచితంగా చేసి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమం లో జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ ప్రవీణ్‌కుమార్, డాక్టర్ శ్రీదేవి, ఫార్మసిస్ట్ రమేష్, స్వామి పాల్గొన్నారు.